సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



గోపాలకులు

సిరిసిల్ల: జిల్లాలోని అత్యధిక గిరిజనులు పశుపోషణే ప్రధాన వనరుగా జీవిస్తున్నారు. ఆవులను పెంచి.. వాటి ద్వారా ఆదాయం పొంది కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈక్రమంలో ఐదారు నెలలపాటు ఇళ్లకు దూరంగా ఆవుల మేత కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. వలసదారిలో రైతుల పొలాల్లో మందపెట్టి.. అలా వచ్చిన ఆదాయంతో కాలం వెల్లదీసుకుంటున్నారు. మళ్లీ వర్షాకాలం మొదలయ్యే సమయానికి ఇళ్ల బాట పడుతున్న గిరిజన పశుపోషకులపై సండే స్పెషల్.. – వివరాలు 8లో..

న్యూస్‌రీల్

ఇదే స్ఫూర్తితో వైద్యసేవలందించాలి



లింగన్నపేట వైద్యులను అభినందిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల: బాగా పనిచేస్తున్నారు.. ఇదే స్ఫూర్తితో మరింత మెరుగైన వైద్యసేవలందించాలని లింగన్నపేట వైద్యులను కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందించారు. లింగన్నపేట పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ వచ్చిన సందర్భంగా వైద్యబృందాన్ని శనివారం అభినందించారు. అదనపు కలెక్టర్ గౌతమి, ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి రజిత, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, ప్రోగ్రామ్ అధికారులు నయీమా, ఉమ, క్వాలిటీ మేనేజర్ సాగర్, లింగన్నపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయ ఆలయానికి వంతెన కోసం పరిశీలన



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నీటిలో వరదవెల్లిగుట్టపై ఉన్న దత్తాత్రేయస్వామి ఆలయానికి వంతెన నిర్మాణానికి మిడ్‌మానేరు డీఈ శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. భక్తుల ఇబ్బందులను కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై మిడ్‌మానేరు ఎస్‌ఈకి మంత్రి పొన్నం లేఖ రాయగా.. డీఈ ఆలయ పరిసరాలు పరిశీలించారు. కూస రవీందర్, రాజు, వెంకటేశం, తిరుపతి ఉన్నారు.

ఆరు గ్యారంటీలతో పేదలకు మేలు



ముస్తాబాద్(సిరిసిల్ల): ఆరు గ్యారంటీలతో పేదలకు మేలు కలుగుతుందని కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నామాపూర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి అక్రమాలకు విసిగి కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం గ్రామాధ్యక్షుడు చీకోటి నర్సింలు, ఉపాధ్యక్షుడు గొడుగు శంకర్, శేఖర్, మద్దికుంట రాములు, గజ్జెల రాజు, ఎంపీటీసీ శ్రీనివాస్, రాజిరెడ్డి, నరేశ్, మోహన్‌రెడ్డి, బాలరాజు, రాజు, దశరథం, రామచంద్రం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక



సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైన ప్రాజెక్టుల వివరాలను జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య శనివారం ప్రకటించారు. జిల్లా నుంచి 2022–23 విద్యాసంవత్సరానికి 67 అంశాలకు 7 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. డ్రైనేజీ క్లీనింగ్ మిషన్, మైక్రో ప్లాస్టిక్ ల్యాండ్రీ ఫిల్టర్స్, డస్ట్ లెస్ డస్టర్స్, పవర్‌లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మిషన్, స్ప్రోకెట్ సైడ్ స్టాండింగ్ నెట్రీవ్ మెషిన్, లైఫ్ సేవింగ్ స్టిక్, ఎల్పీజీ కేజీ గ్యాస్ డిటెక్టర్ ఆటోమేటిక్ బుకింగ్ సిస్టం రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను సెక్టోరియల్ ఆఫీసర్ శైలజ, పరీక్షల నియంత్రణ సహాయాధికారి వెంకటేశ్వర్‌రావు అభినందించారు.

బస్టాండ్‌లో క్యూ రేలింగ్



వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా రద్దీని గమనించిన ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన క్యూ రేలింగ్‌ను వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి శనివారం ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ భక్తులు క్యూ పద్ధతిలో బస్సులు ఎక్కేందుకు క్యూ రేలింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ డీఎం మురళీకృష్ణ పాల్గొన్నారు.

గ్యారంటీల పద్దు

ఉమ్మడి జిల్లాకు రూ.3వేల కోట్ల నుంచి రూ.5వేల కోట్లు కావాలి

- ఇప్పటికే మొదలైన ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు ప్రయాణం
- 'గృహజ్యోతి' అమలుకు మొదలైన ప్రక్రియ
- టెంపుల్ సిటీలుగా వేములవాడ, ధర్మపురి



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఆరు గ్యారంటీల హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో వాటికే పెద్దపీట వేసింది. మొత్తంగా ఆరు హామీల అమలుకు రూ.53,196 కోట్లకుపైగా కేటాయించింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలవుతోంది. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరాకు ఇప్పటికే ప్రక్రియ మొదలైంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలు దిశగానూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. బౌద్ధ, జైన క్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించడంతో కరీంనగర్ జిల్లా నేలకొండపల్లిలోని బొమ్మలగుట్ట జైన, పెద్దపల్లి జిల్లా ధూళికట్టలోని బౌద్ధ క్షేత్రాలకు మంచిరోజులు రానున్నాయని ఉమ్మడి జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు. కరీంనగర్‌లోని శాతవాహన, జగిత్యాల జిల్లాలోని కొండగట్టు, పెద్దపల్లి జిల్లాలోని మంథని జేఎన్టీయూల్లో మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్ కేటాయించారు. అర్హులైన గృహిణులకు ప్రతినెలా రూ.2,500 చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని గతంలోనే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో ఆరు గ్యారంటీలను అమలు చేయాలంటే రూ.3 వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

అంజనాద్రి ప్రస్తావన లేదు



ఉమ్మడి జిల్లాలో రెండు ప్రాచీన పుణ్యక్షేత్రాలైన వేములవాడ, ధర్మపురిలను టెంపుల్ సిటీల కింద అభివృద్ధి చేయనున్నారు. గతంలో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీటీడీఏ) కింద రూ.50 కోట్లు కేటాయించారు. ఇటీవల పలుమార్లు వీటీడీఏ అధికారులు ఈ విషయంపై సమావేశమైన విషయం తెలిసిందే. ఈ పుణ్యక్షేత్రాలను ఎలా అభివృద్ధి చేస్తారనే అంశంలో మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది. గతేడాది కొండగట్టును అంజనాద్రిగా మార్చి, రూ.600 కోట్లు కేటాయిస్తామని ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఈ ఆలయ ప్రస్తావన బడ్జెట్‌లో రాలేదు.

జనరంజక బడ్జెట్



వేములవాడ: రాష్ట్ర ప్రభుత్వం జనరంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ప్రజాప్రభుత్వంలో పేదల అభ్యున్నతికి ఈ బడ్జెట్ ఎంతగానో తోడ్పడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లోనే ఆరు గ్యారంటీల కోసం రూ.53వేల కోట్లు కేటాయించాం. కాగితపు లెక్కలకే కాకుండా కార్మికులు, కర్షకుల కన్నీటిని తుడిచేందుకు కార్యదక్షతతో రూపొందించిన బడ్జెట్.

– ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్

ప్రజల ఆశలకు అనుగుణంగా..



ముస్తాబాద్(సిరిసిల్ల): పదేళ్ల తరువాత ప్రజారంజక బడ్జెట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వ్యవసాయం, విద్య, వైద్యానికి పెద్ద పీట వేసింది. ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యత కల్పించింది. ఇందుకు రూ.53వేల కోట్లను కేటాయించడం బాగుంది. పేదలకు గూడు కల్పించేందుకు రూ.7వేల కోట్లను కేటాయించడం అభినందనీయం.

– కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి

బడ్జెట్ సమతూకంగా ఉంది



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు సమతూకంగా ఉంది. ముఖ్యంగా ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను నెరవేర్చే విధంగా ఈ బడ్జెట్‌ను రూపొందించారు. పేదల బడ్జెట్‌గా చెప్పుకోవచ్చు. అన్ని వర్గాల ప్రజల ఆశలను నెరవేర్చేలా ఉంది.

– దొమ్మాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

విద్యారంగ అభివృద్ధికి సరిపోవు



సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులు సరిపోవు. గతేడాదితో పోల్చితే 1.51 శాతం మాత్రమే పెంచారు. నైపుణ్య శిక్షణకు ఐటీఐలను శిక్షణ కేంద్రాలుగా మార్చడం అభిలషణీయం. మండలానికో పబ్లిక్ స్కూల్ ప్రతిపాదన భేష్.

– పాకాల శంకర్‌గౌడ్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఆశించిన స్థాయిలో లేదు



విద్యకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. మేనిఫెస్టోలో ప్రకటించినట్లు 15 శాతం నిధులు కేటాయించాల్సింది. గురుకులాలు, మోడల్, కేజీబీవీల పేరుతో విద్యావ్యవస్థలో అసమానతలను ప్రభుత్వమే పెంచి పోషిస్తుంది. 20 శాతం నిధులతో ప్రామాణిక ప్రభుత్వ విద్య కోసం ముందడుగు వేయాలి.

– దోర్నాల భూపాల్‌రెడ్డి, టీపీటీఎఫ్, జిల్లా అధ్యక్షుడు

రైతుల కోసం..

ఉమ్మడి జిల్లాలో రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఎకరాకు రూ.2 లక్షల చొప్పున మాఫీ చేస్తామని, ఎకరాకు పెట్టుబడి సాయం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. అలాగే, కౌలు రైతులకు ఆర్థికసాయానికి మార్గదర్శకాలు సిద్ధమవుతున్నాయి.

రైతు భరోసా లబ్ధిదారులు

కరీంనగర్ :	2,03,096
పెద్దపల్లి:	1,39,482
జగిత్యాల:	1,63,000
సిరిసిల్ల:	1,34,725



త్వరలో రూ.500కు గ్యాస్ సిలిండర్

రూ.500కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రభుత్వం త్వరలో అమలు చేయనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 5 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో తెల్లరేషన్ కార్డులు ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

గ్యాస్ కనెక్షన్ల సంఖ్య

కరీంనగర్:	1,32,210
పెద్దపల్లి :	1,31,098
జగిత్యాల:	1,28,312
సిరిసిల్ల:	1,09,100



గ్రామాలకు మంచి రోజులు

కొన్ని నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలు నిధుల్లేక ఇబ్బంది పడుతున్నాయి. కనీసం సిబ్బందికి వేతనాలిచ్చే పరిస్థితి లేదు. చేసిన బిల్లులు రాక కాంట్రాక్టర్లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంచాయతీరాజ్ శాఖకు రూ.40 వేల కోట్లపైచిలుకు బడ్జెట్ కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలన్నీ కోటి ఆశలతో ఎదురుచూస్తున్నాయి.

పంచాయతీల సంఖ్య

కరీంనగర్:	313
పెద్దపల్లి :	266
జగిత్యాల:	380
సిరిసిల్ల:	255



ప్రజాపాలన దరఖాస్తులే కీలకం

ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం.. ఆరు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన దరఖాస్తులే కీలకం. తెల్ల రేషన్‌కార్డు ప్రామాణికం. అయితే, ఈ అర్జీల ఫారాలు నింపడంలో కొందరు లబ్ధిదారులు పొరపాట్లు చేశారు. విద్యావంతులు అధికంగా ఉండే కరీంనగర్‌లోనే దాదాపు 20 వేలకుపైగా దరఖాస్తుల్లో గ్యాస్‌కు సంబంధించిన సమాచారం తప్పుగా ఇచ్చినట్లు సమాచారం. మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తరహా తప్పులు దొర్లాయి. ప్రస్తుతం అధికారులు వీటిని సరిచేస్తున్నారు. ఆ తర్వాత పథకాలు వర్తింపజేయనున్నారు.

ప్రజాపాలన	దరఖాస్తులు	తెల్ల రేషన్‌కార్డులు
కరీంనగర్	3,54,363	2,74,093
పెద్దపల్లి	2,40,371	2,49,000
జగిత్యాల	3,24,532	3,07,659
సిరిసిల్ల	1,92,617	1,73,368



45,500 మందికి ఇందిరమ్మ ఇళ్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 13 నియోజకవర్గాలు ఉన్నాయి. నియోజకవర్గానికి 3,500 లబ్ధిదారుల చొప్పున మొత్తం తొలి విడతలో 45,500 మందికి సొంతింటి కల నెరవేర్చనున్నారు. సొంతింటి జాగ ఉంటే రూ.5 లక్షల ఆర్థిక సాయం కూడా అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ఐకమత్యం.. భక్తిమార్గం

- ఏటా వైభవంగా మార్కండేయుని జయంతి
- పుష్కరకాలంగా ఉత్సవాలు



మార్కండేయ జయంతి కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సిరిసిల్లకల్చరల్: భక్తిమార్గం.. ఐకమత్యం.. అసమానతల తొలగింపే లక్ష్యంగా మొదలైన వేడుకలు పుష్కరకాలంగా వైభవోపేతంగా సాగుతున్నాయి. సిరిసిల్లలో అత్యధికంగా ఉంటే పద్మశాలీలు తమ ఇలవేల్పుగా భావించే మార్కండేయుని జయంతితో తామంతే ఒక్కటే అనే భావనను విస్తరిస్తున్నారు. తారతమ్య బేధాలు లేకుండా.. ఐకమత్యంగా ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. తారతమ్యం లేకుండా ఏకత్వ భావనతో జయంతి వేడుకల్లో పాల్గొనడం విశేషం. ఇప్పటికే పట్టణంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ, న్యాయశాఖమంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎంపీ బండి సంజయ్, స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావులకు ప్రత్యేకంగా ఆహ్వానాలు అందజేశారు.

శోభాయాత్రకు పుష్కరోత్సవం

సిరిసిల్లలో మార్కండేయుని జయంతిని గుర్తించి వేడుకలు నిర్వహించే సంప్రదాయం 2012 జనవరి 26న మొదలైంది. రెక్కాడితే కాని డొక్కాడని సంక్షోభ పరిస్థితుల్లో బతుకులీడుస్తున్న ఆ సామాజికవర్గంలో ఉన్న అంతరాలను తగ్గించి, ఆధ్యాత్మిక భావనతో ఏకం చేసేందుకు, మార్కండేయ జయంతి ఉత్సవ సమితి ఏర్పడింది. ప్రస్తుత కౌన్సిలర్ గూడూరి భాస్కర్, మోర శ్రీనివాస్, మేర్గు సత్యం, రాపెల్లి ముకుందం, గాజుల వేణు, వెంగల అశోక్, బోడ రవి, గెంట్యాల జయంత్, కొక్కుల భాస్కర్ కమిటీగా ఏర్పడింది. 14 రోజులపాటు ప్రతీ ఆలయంలో ద్విసప్తాహ యాగాలు నిర్వహించారు. జయంతికి ఉత్సవ వైభవం కల్పించారు. అనంతరం ఈ సంప్రదాయాన్ని పద్మశాలి సంఘం కొనసాగిస్తూ వస్తోంది.


ఆధ్యాత్మిక భావనల శోభాయాత్ర

శ్రీశివ భక్త మార్కండేయ స్వామి జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం నిర్వహించే శోభాయాత్ర ఆద్యంతం ఆధ్యాత్మిక భావనలను విస్తరింపజేయనుంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మార్కండేయస్వామి వారిని ఊరేగిస్తారు. విద్యార్థులు, మహిళల కోలాటం, నృత్యాలతో శోభాయాత్ర రమణీయంగా సాగిపోతుంటుంది.

ఆహ్వానపత్రం ఆవిష్కరణ

శివభక్త మార్కండేయస్వామి జయంతి వేడుకలకు సంబంధించిన ఆహ్వానపత్రాన్ని శనివారం ఉదయం పద్మశాలి సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ఆవిష్కరించారు. పద్మశాలి సంఘం పట్టణాధ్యక్షుడు గోలి వెంకటరమణ, పద్మశాలి ప్రముఖులు గూడూరి ప్రవీణ్, బొల్లి రామ్మోహన్, ఎల్లె లక్ష్మీనారాయణ, గాజుల బాలయ్య, మోర రవి, మహిళా సంఘం ప్రతినిధులు గుజ్జె తార, కాముని వనిత తదితరులు పాల్గొన్నారు.


ఐకమత్యాన్ని పెంచేందుకు..



సిరిసిల్ల నేతకార్మికులు ఆకలితో ఆత్మహత్యలు చేసుకుంటున్న రోజులలో ఆత్మస్థైర్యం నింపాలని ఓ కృతనిశ్చయంతో ముందుకొచ్చాం. అర్థాకలితో అలమటిస్తున్న కార్మిక లోకంలో ఐకమత్య భావన పెంచేందుకు ఆధ్యాత్మికంగా ఏకం చేయాలని సంకల్పించాం. అందుకే మార్కండేయుని జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి అందరినీ ఏకం చేసేందుకు యత్నించాం. ఆ సంప్రదాయం కొనసాగడం సంతోషం.

– మోర శ్రీనివాస్, ఉత్సవ సమితి తొలి ప్రతినిధి

ఇంటికొకరుగా తరలిరావాలి



మార్కండేయుని జయంతి వేడుకలు మన అందరి పండుగ. ఈ ఉత్సవాల్లో ఇంటికొకరుగా పాల్గొని జయప్రదం చేయడం మన ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుంది. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా కదలిరండి. రేపటి తరాలకు మార్కండేయుని జయంతి ప్రాశస్త్యం తెలియజేయండి.

– గోలి వెంకటరమణ, పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు

ప్రభుత్వ భూముల వివరాలు ఇవ్వండి

- మీ–సేవ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ముస్తాబాద్ తహసీల్దార్‌కు మందలింపు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ప్రభుత్వ భూముల వివరాల సమగ్ర నివేదికను అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి తహసీల్దార్లు ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్‌లతో మాట్లాడారు. వీర్నపల్లి మండలంలో ప్రభుత్వ భూముల వివరాలను తహసీల్దార్ ఇవ్వడంతో ఆయనను అభినందించారు. మిగతా తహసీల్దార్లు త్వరగా ఇవ్వాలని సూచించారు. ఓటరు జాబితాలో సవరణలు, మీసేవ అప్లికేషన్లు పెండింగ్, కోర్టు కేసులు, ప్రభుత్వ భూముల వివరాలపై మాట్లాడారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ ఓట్, పుట్టిన తేదీ తప్పుగా పడిన వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఫామ్–7 తీసుకొని సవరించి, ఆన్‌లైన్‌లో ఈనెల 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కులం, ఆదాయం, ఇతర సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేయొద్దన్నారు. ఆర్డీవో ఆఫీస్‌ల్లో పుట్టిన తేదీ, మరణ ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో సరైన వివరాలు ఉన్న వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల విషయమై చర్చించారు. కలెక్టర్ అడిగిన సమాచారాన్ని ఇవ్వకపోవడంతో ముస్తాబాద్ తహసీల్దార్‌ను మందలించారు. పూర్తి వివరాలతో కలవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ఎస్‌డీసీ గంగయ్య, కలెక్టరేట్ పరిపాలనాధికారి రాంరెడ్డి, పర్యవేక్షకులు శ్రీకాంత్, సుజాత, వేణు ఉన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

సిరిసిల్లకల్చరల్: విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో నిర్వహించిన బ్యాంకర్స్ ప్రీమియర్ లీగ్ ఫైనల్స్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రీమియర్ లీగ్‌లో విజేతగా నిలిచిన యునియన్ బ్యాంక్ జట్టుకు రూ.5వేల నగదు, ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.2,500 నగదు అందించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ల బదిలీ

సాక్షి, పెద్దపల్లి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం రెవెన్యూ అధికారుల బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ ఆర్డీవో ఇ.మల్లయ్యను సింగరేణి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే మల్టీజోన్–1 పరిధిలో పెద్దపల్లి కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్ బి.రాజమణిని జగిత్యాలకు, కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఇ.పుష్పాలతను, మంథని ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న టి.రవీందర్‌ను కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే జగిత్యాల జిల్లాకు చెందిన తహసీల్దార్ మహ్మద్ ఆరిఫ్‌వుద్దీన్, కరీంనగర్‌కు చెందిన వి.రమేశ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన పి.సుమన్ పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేయనున్న కమాన్‌పూర్ తహసీల్దార్ వి.మోహన్‌రెడ్డిని ఎన్నికల విధులతో సంబంధంలేని కలెక్టరేట్ సూపరిటంటెండెంట్‌గా బదిలీ చేశారు.

క్లుప్తంగా

బడ్జెట్ సమావేశాల్లో 'ఆది'



అసెంబ్లీలో డిప్యూటీ సీఎంతో ఆది శ్రీనివాస్

వేములవాడ: రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తదితరులను కలిశారు.

దివ్యాంగులకు సేవ దైవ సేవనే..

- డీఈవో రమేశ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈవో రమేశ్‌కుమార్

సిరిసిల్లఎడ్యుకేషన్: దివ్యాంగులకు సేవలందించడం దేవుడికి సేవ చేసినట్లు అని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని సుందరయ్యనగర్‌లో భవిత సెంటర్‌లో వినికిడి లోపం గల 30 మందికి ఉచితంగా పరికరాలు అందించారు. 'వి వియర్' అనే ప్రైవేటు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం క్యాంపు నిర్వహించారు.

పీవీకి భారతరత్నపై కవుల హర్షం

సిరిసిల్లకల్చరల్: బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారత రత్న ప్రకటించడంపై జిల్లా కవులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం సిరిసిల్లలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం పీవీ దేశానికి సేవలను గుర్తు చేశారు. సంక్షోభ సమయంలో ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి, దేశాన్ని గట్టెక్కించారన్నారు. డాక్టర్ జనపాల శంకరయ్య పీవీ సాహిత్య సేవలు, రచనలను కొనియాడారు. కార్యక్రమంలో కవులు కోడం నారాయణ, ముడారి సాయిమహేశ్, లక్ష్మణ్, బూర దేవానందం తదితరులు పాల్గొన్నారు.

గోపాలకులు

సండే స్పెషల్



ఇతను మాలోత్ హన్మంతు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి మండలం మద్దిమల్ల గిరిజనతండాకు చెందిన హన్మంతుకు వంద వరకు ఆవులు ఉన్నాయి. వాటికి సరిపోయే మేత(పశుగ్రాసం) లేకపోవడంతో నెల రోజుల క్రితం ఊరి విడిచి గంగ వైపు(గోదావరి తీర ప్రాంతానికి) వలస వెళ్లాడు. ఆయనతోపాటు అతని భార్య చక్రి కూడా అతని వెంట వెళ్లింది. పిల్లపాపలను ఇంటి వద్ద అత్తామామల వద్ద వదిలేసింది. ప్రస్తుతం కోరుట్ల శివారు గ్రామాల్లో ఆవులను మేపుతూ ఉన్నారు. మళ్లీ వర్షాకాలంలో జూన్, జూలై నెలల వరకు ఇల్లు చేరుతారు.



ఆవుల పోషణలో మద్దిమల్లకు చెందిన మాలోత్ చక్రి



ఇతను కొడావత్ తిరుపతి. రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం మద్దిమల్ల గిరిజనతండాకు చెందిన తిరుపతి డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఊరి శివారు అడవులు, పొలాల్లో తనకున్న 200 ఆవులను మేపేవాడు. కానీ ఇక్కడ ఇప్పుడు ఆవులకు మేత కరువవడంతో తన ఆవులను కొట్టుకుని వలస వెళ్లాడు. తనకున్న రెండెకరాల పొలంలో వరి పంటను వేసి, ఇలా ఆవుల పోషణలో వలసబాట పట్టాడు. ఉన్న ఊరిలో ఆవులకు గడ్డి లేకనే ఇలా ఊరు విడువాల్సి వచ్చింది.



ఇతను గుగులోత్ భోజ్యా. రుద్రంగి మండలం మానాల శివారులోని చింతామణితండాకు చెందిన భోజ్యానాయక్‌కు 65 ఆవులున్నాయి. వీటిని కాస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మానాల శివారులోనే అడవుల్లో, లూటీ పోయిన పత్తి చేనుల్లో నిత్యం ఆవులను మేపుతుంటాడు. ఇలా ఒక్కరు ఇద్దరు కాదు.. మానాల శివారులోని ఏడు గిరిజన గ్రామాల్లో వంద మంది వరకు ఆవులన పోషిస్తూ.. జీవనోపాధి సాగిస్తున్నారు. వీరికి వ్యవసాయానికి తోడుగా ఆవుల పోషణ తరతరాలుగా వస్తున్న ఆచారంగా మారింది.

- అడవిబిడ్డల బతుకు బాట
- పశుగ్రాసం వేట.. వలస బాట
- ఆవులతో ఆరు నెలలు వనవాసమే..
- ఊరు విడిచి.. తండా విడిచి.. తండ్లాట
- మద్దిమల్ల, వీర్నపల్లి, మానాల గిరి'జనుల' బతుకు పోరాటం

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి మండలం మద్దిమల్ల, వీర్నపల్లి గిరిజన తండాలకు చెందిన 25 కుటుంబాలు ఆరు నెలలపాటు ఇల్లు విడిచి, ఊరును వదిలి వనవాసం చేస్తూ... ఆవులను మేపుతుంటారు. స్థానికంగా గడ్డి లేకపోవడంతో ఊరు వదిలి మన్నెం(వలసపోవడం) అనివార్యమైంది. మద్దిమల్ల నుంచి అటవీమార్గంలో ఆవులను మేపుతూ.. కోరుట్ల, మెట్‌పల్లి, ఖానాపూర్, నిర్మల్ శివారులోకి వెళ్లి.. గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఆవులను మేపుతారు. ఎక్కడ రాత్రి అయితే అక్కడే ఆవులతోపాటు నిద్రిస్తారు. అక్కడే వంట చేసుకుని తింటారు. ఎవరైనా పెద్ద రైతులు తమ పొలాల్లో సేంద్రియ ఎరువుల కోసం ఈ ఆవుల మందలను వారం, పది రోజులు పెట్టించుకుని డబ్బులు ఇస్తారు. ఆవుల మూత్రం, పేడ పొలాలకు సేంద్రియ ఎరువులుగా పనికి వస్తాయి. అందుకే రైతులు ఎక్కువగా ఆవుల మందలను పొలాల్లో పెట్టిస్తారు. అలా వచ్చిన డబ్బులతోనే గిరిజనులు బియ్యం కొనుక్కుని, కట్టెల పొయ్యిపై వంట చేసుకుని తింటారు. కొన్ని ఆవులను, కోడెలను ఒక్కోదాన్ని రూ.15వేల నుంచి రూ.30 వేలకు స్థానిక రైతులకు, పశువుల సంతల్లో అమ్ముతారు. కోడెలు రైతులకు ఎవుసానికి అక్కరకు వస్తుంటాయి. ఇలా ఆరు నెలలపాటు వనవాసం చేసి వర్షాకాలంలో ఇల్లు చేరుతారు.



ఆవుల మంద వద్ద భోజనం చేస్తున్న మహిళలు

ఆవుల మందలే ఆధారం

గిరిజనులకు ఆవుల మందలే ఆధారం. ఒకప్పుడు ఇంకా ఎక్కువ సంఖ్యలో ఆవులు ఉండేవి. ఇప్పుడు వాటిని మేపేందుకు చెల్కలు లేక, అడవుల్లోకి వెళ్లకుండా కంచెలు వేయడంతో ఆవుల సంఖ్య తగ్గింది. మరోవైపు వన్యప్రాణుల భయం వెంటాడుతుండడంతో అడవుల్లోకి వెళ్లడం తగ్గిపోయింది. మైదాన ప్రాంతాలన్నీ పొలాలుగా మారడంతో పశుపోషణ భారమైంది. అయినా.. కొందరు గిరిజనులు ఆవులను పోషిస్తూ.. వాటితో వచ్చే ఆదాయంతో ఇల్లు కట్టడం, పిల్లలను చదివించడం, ఆడపిల్లల పెళ్లిళ్లు చేస్తుంటారు. కానీ ఇటీవల ఆవుల మందల సంఖ్య తగ్గిపోయింది. అయినా.. రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఓ వంద కుటుంబాల వరకు ఆవులే ఆధారంగా ఇప్పటికీ జీవిస్తున్నాయి.



ఇతను గుగులోత్ రాజు. రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల శివారులోని చింతామణితండా. ఇతనికి 70 ఆవులు, కోడెలు ఉన్నాయి. వీటిని నిత్యం సమీప పొలాల్లో, అడవుల్లో తింపుతూ మేపుతాడు. రోజుకు కనీసం 25 నుంచి 30 కిలోమీటర్లు నడుస్తూ.. ఆవులను మేపుతాడు. ఇంటి వద్ద వ్యవసాయం చేస్తూనే ఇలా ఊరి శివారుల్లోనే అడవులు, పొలాలు ఎక్కువగా ఉండడంతో అక్కడే ఆవులను మేపుతాడు.

వేములవాడ ఆలయం శుద్ధి



వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో మార్చి 7 నుంచి నిర్వహించే మహాశివరాత్రి మహోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆలయ గోపురాలను శుభ్రం చేశారు. స్థానిక ఫైర్ సిబ్బంది గోపురాలను నీటి శుభ్రం చేశారు. గోపురాలపై నిలిచిన మురికి, మొక్కలు, పక్షుల గూళ్లను తొలగించారు.

రాజన్న దారిలో..



రాజన్న దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు శనివారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వరుస సెలవులు రావడంతో రాజన్న గుడి ప్రాంతం రద్దీగా మారింది. ఈ–టికెట్ విధానం అమలులో ఉండడం, ఈ విషయం తెలియని భక్తులు వసతిగదులు తీసుకునేందుకు ఇబ్బంది పడ్డారు.

కామన్ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలి



సిరిసిల్లలో ర్యాలీ తీస్తున్న టీచర్లు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లఎడ్యుకేషన్: రాష్ట్ర విద్య, వైజ్ఞానిక మహాసభల సందర్భంగా శనివారం సాయంత్రం సిరిసిల్లలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆది, సోమవారాల్లో ఖమ్మంలో జరిగే సభలను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం విద్యారంగం సమస్యలు పరిష్కరించాలని, కామన్ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుమాల రమానాథ్‌రెడ్డి, నాయకులు ఉమా బాలచందర్, పురుషోత్తం, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

వీర్నపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని నీలగిరి ప్లాంటేషన్ వద్ద శనివారం ఓ జింకపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. గ్రామస్తులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో బేస్ క్యాంపు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. జింకను క్వార్టర్‌కు తరలించి, వెటర్నరీ డాక్టర్‌చే చికిత్స అందించారు. అయినా ఫలితం లేకపోవడంతో మృతిచెందింది. జింకకు అల్మాస్‌పూర్ రిజర్వు ఫారెస్ట్‌లో అంత్యక్రియలు పూర్తి చేశారు. కార్యక్రమంలో వీర్నపల్లి ఎఫ్ఎస్‌వో ఎస్.రంజిత్ కుమార్, అల్మాస్‌పూర్ ఎఫ్ఎస్‌వో బి.పద్మలత, వీర్నపల్లి ఎఫ్‌బీవో సీహెచ్.కిరణ్, బేస్‌క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



చల్లంగా చూడు పోచమ్మతల్లీ

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రంలో పోచమ్మకు చలిబోనాల మొక్కులు చెల్లించారు. మాఘ అమావాస్యను పురస్కరించుకొని పోచమ్మతల్లీకి బోనాలు తీశారు.

ఎన్‌సీడీసీ పాలకమండలి సభ్యుడిగా 'కొండూరి'

- వరుసగా రెండోసారి నియామకం



కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): నేషనల్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎన్‌సీడీసీ), బ్యాంకర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పాలక మండలి సభ్యుడిగా టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు నియమితులయ్యారు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన రవీందర్‌రావు వరుసగా రెండోసారి దేశంలోని ప్రధాన సంస్థలైన ఎన్‌సీడీసీ పాలకమండలి సభ్యుడిగా నియమితులయ్యారు. గ్రామీణ వ్యవసాయ సంస్థలకు శిక్షణనిస్తూ గ్రామీణాభివృద్ధిలో మార్గదర్శిగా ఎన్‌సీడీసీ పనిచేస్తోంది.

ఎంసీ శేఖర్‌కు అంతర్జాతీయ గుర్తింపు



చంద్రశేఖర్ ఫొటోగ్రాఫర్

సిరిసిల్ల: జిల్లా కేంద్రానికి చెందిన మేర్గు చంద్రశేఖర్‌కు అంతర్జాతీయ ఫొటోగ్రఫీ గుర్తింపు లభించింది. టర్కీకి చెందిన ఫొటోగ్రామ్ ఫొటోగ్రఫీ క్లబ్ (ఎఫ్‌పీసీ)– 2024కు సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ సంస్థ చైర్మన్ ఎం.సీ.శేఖర్‌కు గౌరవ మాస్టర్ అవార్డును శనివారం ప్రకటించింది. దేశంలోని వివిధ ఫొటోగ్రఫీ సంస్థలతో కలిసి శేఖర్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ గౌరవ మాస్టర్ అవార్డు లభించింది. చంద్రశేఖర్ తీసిన అనేక ఫొటోలకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభించింది. తాజాగా టర్కీకి చెందిన ఫొటోగ్రఫీ సంస్థ గౌరవ 'మాస్టర్' అవార్డును ప్రకటించడం విశేషం.

నేడు రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ నరేందర్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఒకినావా కరాటే సంస్థల అధినేత వసంత్ కుమార్ తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి మార్షల్ ఆర్ట్స్ కరాటే దోహదపడుతుందని ఏసీపీ అన్నారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు వసంత్ కుమార్ తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్లు సుమంత్ కుమార్, ప్రవీణ్, రాజశేఖర్, రాకేశ్‌రెడ్డి, రిషికుమార్, శరత్, సందీప్ పాల్గొన్నారు.

వేంపల్లిలో చైన్ స్నాచింగ్

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని వేంపల్లిలో శనివారం బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఓ వృద్ధురాలి మెడలోంచి పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన సకినపెల్లి రాజు (60) అనే వృద్ధురాలు వ్యవసాయ పనుల కోసం తోట వద్దకు వెళ్తుండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలోంచి రెండు తులాల పుస్తెలతాడును తెంపుకున్నారు. వృద్ధురాలు గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చేలోపే బైక్‌పై పరారయ్యారు. ఎస్సై నవీన్‌కుమార్ ఘటనా స్థలికి వెళ్లి బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం



ఆలయ ఏఈవో హరికిషన్‌కు నోటీసు అందజేస్తున్న నాయకులు

చందుర్తి(వేములవాడ): పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మీసం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నడిగొట్టు లక్ష్మి అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో శ్రీనివాస్ దీక్షితులుకు శనివారం సమ్మె నోటీసు అందించారు. తమకు రూ.10 వేల వేతనం అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులు మర్రి విజయ, లింగంపల్లి లక్ష్మి, భాగ్య, నర్సవ్వ, గడ్డం మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతివ్వండి

వేములవాడ: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన శానిటేషన్ విభాగం కార్మికులు మద్దతు ప్రకటిచారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములుతో కలిసి ఆలయ ఏఈవో హరికిషన్‌కు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సురక్ష కాంట్రాక్టు రద్దు చేసి, రూ.22 వేల వేతనం ఇస్తూ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

సీఐటీయూ పోస్టర్ ఆవిష్కరణ

బోయినపల్లి(వేములవాడ): ఈ నెల 16న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్ కోరారు. శనివారం బోయినపల్లిలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎడపెల్లి బాబు పాల్గొన్నారు.

వేములవాడ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా

- తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ యథాస్థితి
- ప్రకటించిన ఎన్నికల అధికారులు



వేములవాడ మున్సిపాలిటీ

వేములవాడ: వేములవాడ మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ ఎన్నిక ఈనెల 12న నిర్వహించాల్సి ఉండగా జిల్లా ఎన్నికల అధికారులు శనివారం తాత్కాలికంగా వాయిదా వేస్తూ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారథి ఉత్తర్వులతో మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ ఎన్నిక వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వైస్‌చైర్మన్ ఎన్నిక వాయిదా ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 12న నిర్వహించాల్సిన వైస్‌చైర్మన్ ఎన్నికకు స్థానిక కౌన్సిలర్లు క్యాంప్‌నకు తరలిన విషయం తెలిసిందే. అయితే అనూహ్యంగా వైస్‌చైర్మన్ ఎన్నిక వాయిదా పడడంతో క్యాంప్‌లో ఉన్న కౌన్సిలర్లు ఖంగుతిన్నారు. దీంతో గోవాలో క్యాంప్‌లో ఉన్న కౌన్సిలర్లు ఆదివారం వేములవాడకు చేరుకోనున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యే అభ్యర్థనతో..

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఉన్న తాను హాజరుకాలేనని పేర్కొంటూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ అందించారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి స్పందించి వైస్‌చైర్మన్ ఎన్నికను వాయిదా వేస్తూ ప్రకటించారు.

కౌన్సిలర్ల మధ్య డబ్బుల పంచాయితీ

వైస్‌చైర్మన్ ఎన్నిక సందర్భంగా పలువురు కౌన్సిలర్లు అభ్యర్థుల వద్ద డబ్బులు తీసుకున్నట్లు స్థానికంగా ప్రచారంలో ఉంది. ఇందులో కొంతమంది మాట ఇచ్చి మరోవైపు మొగ్గుచూపి వెళ్లినట్లు చెప్పుకుంటున్నారు. ఈక్రమంలో 12న నిర్వహించాల్సిన వైస్‌చైర్మన్ ఎన్నిక చివరిదశలో వాయిదా పడడంతో ఎవరు.. ఎటు వైపు మొగ్గుతారో తెలియని పరిస్థితి. ఈ క్రమంలో డబ్బులు తీసుకున్న అంశంపై చర్చ సాగుతోంది.

ఎగువమానేరుకు జలకళ



గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని ఎగువమానేరు ప్రాజెక్టులోకి సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ నుంచి వస్తున్న గోదావరి జలాలతో నీటిమట్టం పెరుగుతోంది. మల్లన్నసాగర్ జలాలు కూడవెల్లి వాగు ద్వారా ప్రాజెక్టులోకి చేరుతోంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 31 ఫీట్లు కాగా.. ప్రస్తుతం 25 ఫీట్లకు చేరింది.